# విదేశీ జోక్యం లేకుండా మాలె ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవాలి




**సమీప** భవిష్యత్తులో పరిష్కార సూచనలు లేకుండా మాల్దీవులలో సంక్షోభం కొనసాగుతోంది.

2018 ఫిబ్రవరి 1న మాలె దేశ ఉపాధ్యక్షునికి ప్రభుత్వం విధించిన కారాగారవాస శిక్షను మాల్దీవుల సుప్రీంకోర్టు కొట్టివేసింది. అలాగే మాలె మాజీ అధ్యక్షుడు మహమ్మద్ నషీద్ అరెస్టుకై యమీన్ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను కూడా రద్దుచేసింది. ఇప్పటికే బందీలుగా వున్న ఇతర రాజకీయ నాయకులను విడుదల చేయమని కోర్టు ఆదేశించటంతోపాటు, గతసంవత్సరం మజ్లిస్‌కు (మాలె పార్లమెంటుకు) అనర్హులుగా ప్రభుత్వం పరిగణించిన 12మంది సభ్యులను తిరిగి నియామకంచేస్తూ ఆదేశాలిచ్చింది.

అయితే, మాలె దేశాధ్యక్షుడు అబ్దుల్ యమీన్ న్యాయస్థాన ఆదేశాలను అమలు చేయటానికి నిరాకరించాడు. 2018 ఫిబ్రవరి 5న ప్రభుత్వ బలగాలు సుప్రీంకోర్టు ఆవరణలోకి జొచ్చుకుపోయి ప్రధాన న్యాయమూర్తితో సహా మరో న్యాయమూర్తిని అరెస్టు చేశారు. అదేరోజు రాత్రి దేశంలో అత్యయిక పరిస్థితి విధించినట్లుగా దేశాధ్యక్షుడు యమీన్ ప్రకటించాడు. 30 సం॥ల కాలం మాలెను పరిపాలించిన మయుమూన్ అబ్దుల్ గయూమ్‌తోసహా విపక్ష రాజకీయ నాయకులందరినీ మర్నాడు అరెస్టు చేశారు. ఈ నిరంకుశ, అణచివేత చర్యలతో దేశవ్యాపితంగా నిరసనలు వెల్లువెత్తాయి. దేశం యావత్తు గందరగోళ పరిస్థితుల్లో కూరుకుపోయింది. మాలెలోని పాలకవర్గాలలో ఈ సంక్షోభం నిట్టనిలువుగా విభజనను తీసుకొచ్చింది.

1200 చిన్న చిన్న ద్వీపాలతో, 4,27,000 జనాభా కలిగిన ద్వీప సముదాయ దేశమే, మాల్దీవులు. తీవ్రమైన ఆర్థిక వనరుల కొరత నెదుర్కొంటున్న ఈ దేశం, పర్యాటక రంగంనుండి లభించే ఆదాయం పైనే అధికంగా ఆధారపడివుంది. కీలకమైన నౌకా మార్గాలకు దగ్గరగా ఈ ద్వీప సము దాయం ఉండటంతో, హిందూ మహాసముద్రంలో మాలె ఒక వ్యూహాత్మక స్థానాన్ని కలిగి వుంది.

మయుమూన్ అబ్దుల్ గయూమ్‌యొక్క నిరంకుశ ఏలుబడిలో 30 సం॥ల కాలం మాలె వుంది. గయూమ్ ప్రధాన న్యాయమూర్తితో వివాద పడటమేగాక, అతనిని అరెస్టు చేయించే దాకా వెళ్ళాడు. సైనిక తిరుగుబాటుతో గయూమ్ రాజీనామా చేయ వలసివచ్చింది. 2008 సం॥లో మొదటిసారిగా ఎన్నిక ద్వారా మహమ్మద్ నషీద్ దేశాధ్యక్షుడు అయ్యాడు. 2013 ఎన్నికలలో అతను ఓటమి పొందాడు; అబ్దుల్ యమీన్ దేశాధ్యక్షుడు అయ్యాడు. టెర్రరిజం ఆరోపణలపై నషీద్‌కు జైలుశిక్ష విధించారు. అరెస్టునుండి తప్పించు కోవటానికి అతను 2016 నుండి ప్రవాసంలో వుంటున్నాడు.

పాలకవర్గాలలోని రెండు విభాగాలలో ప్రస్తుతం ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న మాలెలోవున్న యమీన్ నాయకత్వంలోని విభాగానికి – ప్రవాసంలో వుంటూ మాలెలో ప్రతిపక్షానికి నాయకత్వం వహిస్తున్న నషీద్ నేతృత్వంలోని మరో పాలక విభాగానికి నడుమ పెరుగుతోన్న వైరుధ్యం, అధికారంకోసం సాగించే పోరాటంయొక్క వ్యక్తీకరణే నేడు కొనసాగుతున్న సంక్షోభం.

అంతర్జాతీయ సంబంధాల గురించి చెప్పుకుంటే, మాలె ప్రభుత్వం చైనాకు దగ్గరగా వుంటుంది. ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక సంబంధాల అంశంలో భారతదేశం కంటే చైనాను మాలె ఎక్కువగా ఇష్టపడుతుంది. అయితే మరో వైపున మాలె సంక్షోభంలో జోక్యం చేసుకో వలసిందిగా నషీద్, భారతపాలకులకు విజ్ఞప్తి చేస్తున్నాడు. సైనికజోక్యం చేసుకోమనే వరకు అతను పిలుపునిచ్చాడు. మాలెలో ప్రస్తుత యమీన్ పాలనను అంతమొందిస్తే, అది– మాలెలో పెరుగుతోన్న చైనా ప్రభావాన్ని నిరోధించటానికి తోడ్పడటంద్వారా భారత ప్రయోజనాలకు కూడా ఉపయోగపడుతుందని, భారతదేశానికి మరింత అనుకూలంగా పరిస్థితిని మలుచుకోవచ్చునని భారత పాలకులకు నచ్చ జెప్పేందుకు నషీద్ ప్రయత్నిస్తున్నాడు.

సారాంశంలో మాలెలో సంక్షోభం వారి ఆంతరంగిక సమస్య. వారి దేశ ప్రయోజనాలను, ప్రజల జీవితాలను, హక్కులను ఏవిధంగా పరిరక్షించుకోవాలనేది మాలెలోని ప్రజలు, ప్రజాస్వామికశక్తులు నిర్ణయించుకోవాలి. అధికారం కోసం కుక్కల కాట్లాటలో చిక్కుకున్న పాలక వర్గాలలోని విభాగాలు సమస్యను మరింత జటిలంచేస్తూ, ప్రజల వాస్తవిక సమస్యల నుండి వారి దృష్టిని మళ్ళిస్తున్నాయి.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో మాలెవంటి చిన్న, బలహీనదేశం ఏదో ఒక పెద్ద లేదా శక్తివంతమైన దేశానికి లోబడకుండా శాంతి భద్రతలతో మనుగడ సాగించగలుగుతుందా? మాలె తరహాలో ఆంతరంగిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఒక చిన్న, బలహీన దేశానికి విదేశీ జోక్యంకోసం ఎదురుచూడటం లేదా విదేశీ జోక్యంపై ఆధారపడటం సూచించదగినదేనా? లేక అనివార్యమౌతుందా? మాలె పరిణామాలలో జోక్యం చేసుకొనమని, దానికి బదులుగా భారత పాలకుల ప్రయోజనాల పరిరక్షణకు

కట్టుబడి వుంటామని మౌన వాగ్దానం చేస్తున్న మాలె ప్రతిపక్షనేత నిషాద్ మాలె దేశ, ప్రజల సార్వభౌమత్వానికి, ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడా? – వంటి ప్రశ్నలు మన ముందున్నాయి.

మాలెలో నెలకొన్న ప్రస్తుత సంక్షోభ సందర్భంలో, భారతప్రభుత్వం యమీన్ ప్రభుత్వ నియంతృత్వ చర్యలను తీవ్రంగా విమర్శించింది. అది ఇక్కడితో ఆగలేదు. మాలె ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయటానికి, మద్దతు కూడగట్టటానికి కావలసిన అవకాశాలన్నింటిని మాలె ప్రతిపక్షనేత నషీద్‌కు భారత ప్రభుత్వం కలుగజేసింది. సంక్షోభ విషయంలో భారత జోక్యానికై అతని అభ్యర్ధనకు అనుకూలంగా చెవొగ్గింది.

రెండు ప్రధాన అంశాలను ఈ సందర్భంగా పరిగణలోకి తీసుకోవాలి: (1) దక్షిణాసియా ప్రాంతంలోని దేశాల రాజకీయ, సైనిక వ్యవహారాలలో అనేకసార్లు జోక్యం చేసుకున్న చరిత్ర భారత పాలకులకు వుంది. శ్రీలంకలో తిరుగుబాటును అణచటానికి 1971లో భారత పాలకులు ఆ దేశానికి సైనికులను పంపారు. తిరిగి అదే సంవత్సరం, పాకిస్థాన్ విభజనకు, బంగ్లాదేశ్ ఏర్పాటుకు కారణమైన పూర్తిస్థాయి యుద్ధాన్ని తూర్పు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారతదేశం సాగించింది. శ్రీలంక ప్రభుత్వ ఆహ్వానంపై 1980లలో తమిళ ఉద్యమాన్ని అణచివేయటానికి భారతదేశం శ్రీలంకకు ఐపికెఎఫ్ బలగాలను పంపింది. మాలెలో మయుమూన్ అబ్దుల్ గయూమ్ పాలనకు వ్యతిరేకంగా సైనిక తిరుగుబాటును అడ్డుకు నేందుకు కాక్టస్ పేరుతో భారతప్రభుత్వం సైనిక చర్యను చేపట్టింది. ఇవి కొన్ని సంఘటనలు మాత్రమే. (2) అమెరికా సామ్రాజ్యవాదుల నాయకత్వంలోని అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల వ్యూహాత్మక కూటమిలో భారత పాలకులు భాగస్వాములుగా వున్నారు. హిందూమహా సముద్ర పరిరక్షణ, స్వేచ్ఛగా, భద్రంగా నౌకల రాకపోకలు ఈ కూటమి లక్ష్యం. కానీ, వాస్తవంలో, ఇది చైనాకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. ఆసియాపై, ఆసియా – పసిఫిక్ ప్రాంతంపై తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకోవాలనే ప్రయత్న మార్గంలో, అమెరికా చైనాను ఒక శక్తివంతమైన అవరోధంగా పరిగణిస్తోంది. చైనా – భారత్‌ల నడుమ శత్రుత్వాన్ని, కొట్లాటను రేపటానికి అమెరికా వివిధ ప్రయత్నాలు చేస్తోంది. మాలెలో చైనా ప్రభావాన్ని అడ్డుకోవలసిన అవసరాన్ని మాలె ప్రతిపక్ష నాయకుడు నషీద్ నొక్కి చెప్పటం, కేవలం ఈ చైనా వ్యతిరేక కార్డును ప్రయోగించ టానికే. ఈ అంశాలు మాలె ఆంతరంగిక వ్యవహారాలలో భారతదేశం జోక్యం చేసుకొనే అవకాశాలను సూచిస్తున్నాయి.

ఏమైనా, భారత పాలకులు ఒక సైనిక చర్య చేపట్టటానికి ముందు అన్ని విధాలా ఆలోచించాలి. గత కాలపు సైనికజోక్యాలన్నీ వారికి చెడ్డపేరును, అప్రతిష్టను సమకూర్చి పెట్టాయని భారత పాలకులకు తెలుసు. మాలెలో భారత సైనిక జోక్యమంటే, ప్రస్తుత మాలె ప్రభుత్వాన్ని తొలగించే ప్రయత్నం, పాలకవర్గాలలోని మరో విభాగాన్ని అధికారంలో ప్రతిష్టించటమే. దేశభక్తియుతమైన, స్వతంత్ర స్పృహకల్గిన ప్రజలెవ్వరూ ఈ చర్యను ఆమోదించ లేరు. ఇది పాలకులు సిగ్గుపడాల్సిన చర్య. విదేశీశక్తుల బలంతో అధికారంలో ప్రతిష్టించ బడిన ప్రభుత్వం, సార్వభౌమాధికారాన్ని, స్వతంత్రతను కలిగివున్నట్లుగా చెప్పుకోజాలదు. ఆ ప్రభుత్వం తన దేశ, ప్రజల హక్కులను, ప్రయోజనాలను కాపాడలేదు. ఇలాంటి జోక్యాలు తిరిగి ఎదురుగొడతాయి. వారు విపక్షాలను ఆహ్వానించటం, దేశాలనుండి అనేక ఇతర రూపాలలో, అనేక కోణాలలో ప్రతిచర్యలకు కారణమవుతాయి. మాలె దేశం, ప్రజలు మరింత తీవ్రమైన, అంతులేని సంక్షోభంలోకి నెట్టివేయబడటానికి అన్ని అవకాశాలున్నాయి. మాలెతో సహా ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో భారత పాలకుల అన్యాయమైన, విధ్వంసకరమైన జోక్యాన్ని భారత ప్రజానీకం, ప్రజాస్వామికశక్తులు ఏనాడూ ఆమోదించరు.

మాలె ప్రభుత్వం – ప్రజలను, భిన్నాభి ప్రాయాలుగల వారి ప్రజాస్వామిక హక్కులను, స్వేచ్ఛలను క్రూరంగా అణచివేయటాన్ని–భారత ప్రజలు, ప్రజాస్వామికశక్తులు తీవ్రంగా ఖండిస్తారు. అధికారంకోసం సాగే వారి పోరాటంలో మాల్దీవులలోని శ్రామిక ప్రజలను సాధనంగా వినియోగించే పాలకవర్గాల ప్రయత్నాలను వారు వ్యతిరేకిస్తారు. అధికారం కోసం విదేశీ శక్తులకు మాలె ప్రయోజనాలను అమ్మివేయటాన్ని వారు వ్యతిరేకిస్తారు. ఏ విదేశీ జోక్యం లేకుండా తమ సమస్యల పరిష్కారానికి, ప్రజాస్వామిక, స్వతంత్ర, సౌభాగ్యవంతమైన దేశ నిర్మాణానికి మాలె ప్రజలు పోరాడాలి.

ooooo